క్లుప్తంగా

కేఎల్‌యూలో రక్తదాన శిబిరం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయం స్టూడెంట్ ఆక్టీవిటీ సెంటర్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ యూనిసెఫ్, సేఫ్‌లైఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని, రక్తదానం మరో వ్యక్తికి ప్రాణదామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకొకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా శరీరంలో రక్తం వృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ టి.గోపాలకృష్ణ, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఫార్మసీ విభాగ అధ్యాపకులు డాక్టర్ కె.సుకీర్తి, సేఫ్ లైఫ్ క్లబ్ హెబ్ కళ్యాణ్, వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వ్యాక్సినేషన్ పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం-2 సచివాలయం, నుదురుపాడు, గొల్లపాలెంలోని ఆరోగ్యకేంద్రాలను శనివారం జిల్లా హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరిధర్ పరిశీలించారు. వ్యాక్సినేషన్‌లో ఎందరికి వ్యాక్సిన్ వేస్తున్న వివరాలు, వ్యాక్సినేషన్ శీతలీకరణ గురించిన వివరాలు ఆరోగ్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యసిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యసేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఆయన వెంట మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో టి.లూర్దురాజు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్స్ అందజేత

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పూర మస్తాన్‌రావు అండ్ శివరాజకుమారి ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష కిట్స్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన కిట్లను అందజేయడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో పీటీ మాస్టర్ కాంతారావు, జోజప్ప, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని గ్రామపెద్ద మేరువ ఈశ్వరరెడ్డి ప్రారంభించారు. ఫిరంగిపురం పశువైద్యాధికారి కోటిరత్నం మాట్లాడుతూ ఈనెల 24నుంచి వచ్చే 24వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం 35 పశువులకు వ్యాధినిరోదక టీకాలు వేశారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఆర్.వినీల, ఆర్‌బీకే అసిస్టెంట్ జె.ఇస్మాయిల్, రైతులు పాల్గొన్నారు.

రాయపూడి ఈద్గాకు స్థలం కేటాయించండి

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలోని ఈద్గాకు స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లింలు వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఎన్నాళ్లగానో ఈద్గాకు స్థలం లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో రోడ్లపైన కూడా పండుగ సమయాల్లో ప్రార్థనలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కత్తెర సురేష్‌కుమార్ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మంగళగిరి: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రహమాన్ అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా కళాశాల వద్ద నుంచి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రహమాన్ మాట్లాడుతూ యువత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి రేఖా నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు శనివారం ప్రాతూరు గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడారు. వలంటీర్లను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రుతురమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్‌లను అభినందించారు.

నగరానికి మరో వరం..అదనపు జిల్లా కోర్టు

- మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు హైకోర్టు అనుమతి
- రూ.25లక్షలతో అదనపు కోర్టు భవనానికి మరమ్మతులు
- ఎమ్మెల్యే ఆర్కే కృషిపై న్యాయవాదుల హర్షం



పట్టణంలోని కోర్టు కార్యాలయం

మంగళగిరి: మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నగర పాలక సంస్థగా అవతరించిన మంగళగిరి–తాడేపల్లి పట్టణాలకు మరో వరంగా మారనుంది. జిల్లాలో తెనాలి, పల్నాడు జిల్లా నరసావుపేట పట్టణాలలో మాత్రమే అదనపు జిల్లా కోర్టులు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా బాపట్లలో కోర్టు ఏర్పాటు చేశారు. మంగళగిరి–తాడేపల్లి నగరంలోనూ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని 2018 సంవత్సరం నుంచి బార్ అసోషియేషన్ ప్రతిపాదనలు చేసినా అప్పటి ప్రభుత్వం ఆర్థిక భారం నెపంతో ఫైలును పెండింగ్‌లో పెట్టింది. కొద్ది రోజుల కిందట బార్ అసోషియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోర్టును సందర్శించారు. కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలను టీడీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన విషయాన్ని అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు. 500 కేసులు పైన ఉంటే అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ప్రస్తుతం 1270కేసులకుపైగా ఉన్నాయని అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజధానిలో ప్రధాన పట్టణాలుగా ఉన్న మంగళగిరి, తాడేపల్లి పట్టణాలు, గ్రామాలను కలుపుకుని నగరపాలక సంస్థగా మారి జాతీయరహదారి కనకదుర్గ వారధి నుంచి కాజ టోల్‌గేట్ వరకు, తుళ్లూరు, తాడికొండ మండలాలు మంగళగిరి కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు ద్వారా కక్షిదారులు, న్యాయవాదులు గుంటూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే కేసులు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కోర్టులో కేసులు పరిష్కారం కోసం తీర్పులు వెలువరించిన సమయంలో అప్పీలు, బెయిల్ దేనికైనా గుంటూరు కోర్టుకు వెళ్లాల్సి రావడంతో కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి మంగళగిరి కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అదనపు కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినా నిధుల కొరత వెంటాడుతుండడంతో కోర్టు ఏర్పాటు ఆలస్యమవుతుంది. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో అధికారులు నగర పాలక సంస్థ నుంచి రూ.25లక్షల నిధులు మంజూరుతో హైకోర్టు భవన నిర్మాణం, మరమ్మతులకు అనుమతులు ఇవ్వాలని హైకోర్టును కోరారు. స్పందించిన హైకోర్టు అందుకు అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు కానుంది. త్వరలోనే అదనపు కోర్టు భవనాలకు మరమ్మతులు చేపట్టి కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంతో పాటు తుళ్లూరు, తాడికొండ ప్రాంతాలలోని కక్షిదారులు గుంటూరు వెళ్లే పని లేకుండా మంగళగిరి కోర్టులోనే వివాదాలు పరిష్కరించుకోవచ్చు. తద్వారా ఆయా ప్రాంతాల ప్రజల సమయం ఆదా కావడంతో డబ్బు వృథా తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అభినందనీయం



మంగళగిరి కోర్టులో ఉన్న కేసుల సంఖ్య నేపథ్యంలో జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. 2018 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినా ఆర్థిక భారం నెపంతో ఫైలును పెండింగ్ పెట్టింది. ఎమ్మెల్యే ఆర్కేను కలిసిన వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్లి కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు నగర పాలక సంస్థ నుంచి నిధులు కేటాయించడం అభినందనీయం.

–దొడ్డక బ్రహ్మానందరావు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్

కక్షిదారులకు మేలు



అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు వల్ల కక్షిదారులకు మేలు. ప్రస్తుతం అప్పీలు, బెయిల్ కోసం కక్షిదారులు, న్యాయవాదులు గుంటూరు కోర్టుకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో సమయంతోపాటు డబ్బులు ఖర్చు అవుతున్నాయి. గతంలో అనేక మంది ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఎమ్మెల్యే ఆర్కేకు సమస్యను వివరించిన వెంటనే సమస్య పరిష్కరించారు.

–బొర్రా మధు, న్యాయవాది

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే ఆర్కే చొరవతో అదనపు జిల్లా కోర్టుకు ప్రభుత్వం, హైకోర్టు అనుమతులు మంజూరు చేశాయి. నగరపాలక సంస్థ నుంచి నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే ఆర్కేకి కృతజ్ఞతలు.

–కుడిపూడి రాజశేఖర్, న్యాయవాది

పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరులో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సత్యానంద్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాలతో పౌష్టికాహారం తయారు చేసుకునే విధానంపై ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది శాంత, భార్గవ్, సరళ, సూపర్‌వైజర్ నిర్మల, ఆరోగ్యసిబ్బంది కానుక మేరి, ఆశాకార్యకర్తలు మాధవి, హేమలత, అంగన్‌వాడీలు వి.రజని, పద్మావతి, కె.నవనీత, జి.అరుణ కుమారి పాల్గొన్నారు.

మేడికొండూరు: మేడికొండూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శనివారం పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం, చిరుధాన్యాల ప్రయోజనాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీతారావమ్మ అవగాహన కల్పించారు. పౌష్టికాహారం నినాదంతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, సీహెచ్‌ఓ రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

మంగళగిరి: నగరంలోని నిడమర్రు రోడ్డులో గల మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు మూడో విడత నిధులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాటలే మాకు శిరోధార్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలే తమకు శిరోధార్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు భారత్‌పేటలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి నష్టం కలిగించి అవినీతి రాజకీయాలకు పాల్పడే వారికి పార్టీ తగిన రీతిలో బుద్ధి చెప్పిందని, తప్పు చేసిన వారెవరైనా శిక్షకు గురికాక తప్పదన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని తనను తాడికొండ సమన్వయకర్తగా అధిష్టానం పంపించిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తున్నామన్నారు. సమావేశంలో ఫిరంగిపురం, మేడికొండూరు జెడ్పీటీసీలు దాసరి కత్తిరేణమ్మ, కందుల సిద్ధయ్య, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నగదు అందేలా చూడాలి

ఆసరా పథకం కింద మహిళా గ్రూపుల ఖాతాలలో జమ అయిన నగదు సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు భారత్‌పేటలోని తన కార్యాలయంలో ఎంపీడీవోలు, ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమచేసిన ఆసరా నగదు వ్యక్తిగత ఖాతాలలో జమ అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఏపీఎంలదే అన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించిన ఆయన సత్వరమే పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఏపీఎంలు, ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మారణాయుధంతో హల్‌చల్



గొడ్డలితో హల్‌చల్ చేస్తున్న పఠాన్ అక్బర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకలో ఓ టీడీపీ కార్యకర్త రెచ్చిపోయి ఫ్లెక్సీలు చింపి, మారణాయుధంతో హల్‌చల్ చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. పెనుమాకలో రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మసీదు సమీపంలో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అక్కడే నివాసముండే టీడీపీ కార్యకర్త పఠాన్ అక్బర్ ఖాన్ ఆ ఫ్లెక్సీలను చింపివేసి గొడ్డలి పట్టుకుని వీరంగం చేశాడు. ఇదిలా ఉండగా మసీదు వద్ద ఎటువంటి రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు పెట్టకూడదని తీర్మానం చేశారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఫ్లెక్సీ మసీదు సమీపంలో ఉన్న జనసేన కార్యకర్త ఇంటి వద్ద ఏర్పాటు చేసినట్లు జనసేన కార్యకర్తలు చెబుతున్నారు. ఈ సంఘటనపై జనసేన నాయకులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పఠాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు సమాచారాన్ని అందించాలని పట్టణ పోలీసులు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: అనారోగ్యానికి గురై ఆరోగ్యశ్రీ పొందలేక చికిత్స పొంది సొంత నిధులు ఖర్చు చేసిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇచ్చే ఆర్థిక సాయం ఆ కుటుంబ ఆర్థిక తోడ్పాటుకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని ఆటోనగర్‌లో గల ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎనిమిది మంది బాధితులకు రూ.6లక్షల విలువైన చెక్కులు ఎమ్మెల్యే ఆర్కే అందజేశారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో అనారోగ్యానికి గురై వైద్యానికి డబ్బులు లేక మనిషి ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీతోపాటు ఆరోగ్యశ్రీ అందని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిధులు మంజూరు చేసి ఆయా బాధిత కుటుంబాలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, సాలి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్న మోదీ

- ఏపీసీసీ ప్రధానకార్యదర్శి చిలకా విజయ్‌కుమార్
- తాడికొండలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

తాడికొండ: ప్రధాని మోదీ దేశంలో రోజురోజుకీ ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్నాడని ఏపీసీసీ ప్రధానకార్యదర్శి చిలకా విజయ్‌కుమార్ అన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో శనివారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, న్యాయ వ్యవస్థలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ తప్పు పట్టదని, అప్పీల్‌కు 30 రోజులు గడువు ఉన్నప్పటికీ అనర్హత వేటు వేయడం దారుణమన్నారు. బీజేపీకి పతనం తప్పదన్నారు. కార్యక్రమంలో తాడికొండ మండల అధ్యక్షులు షేక్ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ లియాఖత్, తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడుసుమల్లి శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు షేక్ బాషా, షేక్ హుస్సేన్, మండల కార్యదర్శి మట్టుపల్లి అనీల్ కుమార్, పెదపరిమి గ్రామ అధ్యక్షులు షేక్ రఫీ, చిలకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో నూరుశాతం పన్నులు వసూలు

అభినందించిన డీపీఓ కేశవరెడ్డి



పంచాయతీ కార్యదర్శులను అభినందిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 శాతం పన్నుల వసూలు చేసిన దుగ్గిరాల పంచాయతీ సెక్రటరీలను శనివారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి ఆర్.కేశవరెడ్డి అభినందించారు. ఆయన ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం మందిరంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో 100 శాతం పన్నులు వసూలు చేసింది దుగ్గిరాల ఒక్కటేనని, దుగ్గిరాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఇతర ప్రాంతాల్లోని సెక్రటరీలకు ఆదర్శమని అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గత సంవత్సర బకాయిలు కలిపి రూ.1,84,73,051 వసూలు చేయాల్సి ఉండగా మొత్తం వసూలు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ పంచాయతీ అధికారి ఆర్ శ్రీనివాసరావు నాయక్, విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ సెక్రటరీలను, సచివాలయ సిబ్బందిని ఆయన అభినందించారు.

మానవత్వం చాటిన ఖిద్మత్ సభ్యులు

నిరుపేద యువకుని మృతదేహానికి అంత్యక్రియలు

మంగళగిరి: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుని మృతదేహానికి నగరానికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే... నగర పరిధిలోని ఉడా కాలనీ బాపనయ్యనగర్ ఐదో లైనుకు చెందిన వలపర్ల నాగమల్లేశ్వరరావు (24) కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం నగరంలోని స్టేషన్ రోడ్‌లోని సులభ్ కాంప్లెక్స్ వద్ద మృతి చెందాడు. ఆటో డ్రైవర్లు నగరానికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులకు సమాచారాన్ని అందించారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న ఖిద్మత్ టీమ్ సభ్యులు నాగమల్లేశ్వరరావు తల్లికి, సోదరుడికి సమాచారాన్ని అందించారు. మృతదేహం అంత్యక్రియల ఖర్చులకు తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో స్పందించిన ఖిద్మత్ టీమ్ సభ్యులే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు జరిపించారు.

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

- సుమారు రూ. 5లక్షల విలువైన బంగారం, వెండి అపహరణ
- ద్విచక్ర వాహనం మాయం



చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

మంగళగిరి: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఇస్లాంపేటకు చెందిన అబ్దుల్ మజీద్ ఇటీవల నూతన అంతస్తు నిర్మించుకున్నాడు. శుక్రవారం రాత్రి తన కుటుంబంతో కలసి నిద్రిస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు మజీద్ కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న గది తలుపులకు గడియ పెట్టారు. కింది అంతస్తులోని తలుపుల తాళాలు పగులగొట్టి బీరువాలోని ఐదు కాసుల బంగారం, 20 తులాల వెండి పట్టీలు, మైకుతోపాటు రూ.5వేల నగదు అపహరించారు. నగరంలోని భాగవతుల వారి వీధిలో నివసిస్తున్న కుంచాల ప్రేమ్‌సాగర్ తన కుటుంబసభ్యులతో కలసి తిరుపతి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 20 గ్రాముల బంగారం, అరకేజీ వెండి, మూడు వాచీలతోపాటు రూ.5వేల నగదును గుర్తు తెలియని దుండగులు తీసుకెళ్లారు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే సేవను అలవర్చుకోవాలి

దుగ్గిరాల తహసీల్దార్ కె.మల్లేశ్వరి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు విద్యతోపాటు సేవను కూడా జీవితంలో అలవాటు చేసుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ కె.మల్లేశ్వరి అన్నారు. శనివారం కేఎల్ విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం పెదపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపాలు లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులు విద్యతోపా టు సామాజిక సేవ అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్ బాసిత్, ఎన్.మానస పెదపాలెం గ్రామ సర్పంచ్ పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వలంటీర్లను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, వ్యవసాయ విభాగాధిపతి సెంథిల్ మురుగన్, డైరెక్టర్ పి. రత్నప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేట పంప్‌హౌస్ నుంచి బ్రహ్మానందపురం ఓవర్‌హెడ్ ట్యాంకుకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌కు శనివారం మరమ్మతులు నిర్వహించారు. బొగ్గిళ్ల వద్ద పైపులైన్ దెబ్బతింది. ఉదయం నుంచి బ్రహ్మానందపురానికి తాగునీటి సరఫరా నిలిపివేశారు. ఐదు గంటలు శ్రమించి పైపులైన్‌కు మరమ్మతులు చేసి సాయంత్రానికి తాగునీటిని సరఫరాను పునరుద్ధరించారు. ఈ రహదారిలో అధిక లోడ్‌తో వాహనాలు తిరగడం వల్ల పైపులైను దెబ్బతిన్నట్లు సిబ్బంది గుర్తించి పైపులైన్ మీద లారీలు వెళ్లకుండా అక్కడక్కడ రాళ్లను ఏర్పాటు చేశారు.

బోరు పంపునకు...


వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బోరు పంపులకు మరమ్మతులు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. దానిలో భాగంగా శనివారం డోలాస్‌నగర్ కొండ ప్రాంతంలో ఉన్న రెండు బోరు పంపులకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రెండు పంపులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామని, ప్రజలు వాటిని వినియోగించుకోవచ్చని డోలాస్‌నగర్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి తెలిపారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాంబశివరావు కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు రాష్ట్ర రహదారిపై మృత దేహంతో శనివారం సాయంత్రం రాస్తారోకో చేశారు. మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో జి.సాంబశివరావు మృతిచెందిన విషయం విదితమే. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో వచ్చి మృతుడి బంధువులతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి న్యాయంజరిగేలా చూస్తానని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. రాస్తారోకోతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com